అసెంబ్లీలో పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

కార్పొరేషన్, ఫిబ్రవరి 8: అసెంబ్లీలో జ్యోతిబాపూలే విగ్రహ ఏర్పాటుపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని యునైటెడ్ పూలే ఫోరం రాష్ట్ర నాయకుడు గుంజపడుగు హరిప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం తారక హోటల్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కరీంనగర్‌లో బీసీల హక్కుల సాధనకై ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని తమ సూచనలు, సలహాలు అందించిన బీసీ కుల సంఘాల, బీసీ సంఘాల నాయకులకు, మద్దతు ప్రకటించిన వివిధ రాజకీయ పార్టీలకు ధన్యవాదాలు తెలిపారు. రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు ఎమ్మెల్సీ కవిత మీద అనవసరమైన విమర్శలు చేస్తున్నారని వాపోయారు. ఏప్రిల్ 11లోగా అసెంబ్లీలో పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఫోరం జిల్లా కన్వీనర్ శ్రీనివాస్, నాయకులు సత్యనారాయణగౌడ్, మహేశ్‌కుమార్, రాజేశ్వరిగౌడ్, కనకయ్య, రాజు, భాస్కరరావు, రమేశ్, జయంత్, చంద్రయ్య గౌడ్ పాల్గొన్నారు.

బసు షెల్టర్ పనులను ప్రారంభిస్తాం

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 8: మొగ్దుంపూర్ బసు షెల్టర్ నిర్మాణ పనులను శుక్రవారం నుంచి ప్రారంభిస్తామని ఆర్టీసీ డీఈ లక్ష్మారెడ్డి తెలిపారు. గురువారం మొగ్దుంపూర్‌లో ఆర్టీసీ బసు షెల్టర్‌ను ఆయన పరిశీలించారు. బసు షెల్టర్ నిర్మాణ పనులను మధ్యలో ఎందుకు నిలిపివేశారని మాజీ సర్పంచ్ జక్కం నర్సయ్య డీఈని నిలదీశాడు. పాత బసు షెల్టర్ స్థలంలోనే పనులు చేపట్టాలని స్థానికులు అధికారికి వివరించారు.

విరాళం అందజేత

చొప్పదండి, ఫిబ్రవరి 8: పట్టణంలోని వేంకటేశ్వర-మణికంఠ ఆలయంలో అన్నదాన కార్యక్రమానికి పట్టణానికి చెందిన ఎన్నం పద్మ-మునీందర్ దంపతులు రూ. 54,116 గురువారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు వెంకన్న ఉన్నారు.

టెండర్ల ఆహ్వానం

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 8: పాతబజార్ గౌరీశంకరాలయంలో టెంకాయలు, పూజా సామగ్రి అమ్మకాల హక్కు కోసం టెండర్లు ఆహ్వానం కోసం ఏసీ కార్యాలయం ద్వారా బుధవారం అనుమతి పొందినట్లు ఈవో ఉడుతల వెంకన్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఆలయంలో సంప్రదించాలని సూచించారు. అర్హులైన వారు ఈనెల 12న ఉదయం 10.30 గంటలకు ఆలయ కార్యాలయంలో జరిగే వేలంలో పాల్గొనాలని కోరారు.

నగరంలో ప్రాపర్టీ షో

- నేడు, రేపు నిర్వహణ

కార్పొరేషన్, ఫిబ్రవరి 8 : మన కరీంనగర్‌లో నేడు ప్రాపర్టీ షో ప్రారంభం కాబోతున్నది. రెవెన్యూ గార్డెన్స్ వేదికగా 'నమస్తే తెలంగాణ', 'తెలంగాణ టు డే' సంయుక్తంగా రెండు రోజుల పాటు నిర్వహించనున్నది. శుక్రవారం ఉదయం 10గంటలకు ప్రారంభమై శనివారం రాత్రి 7గంటల వరకు కొనసాగనుండగా, అందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. హైదరాబాద్, కరీంనగర్‌కు చెందిన ప్రముఖ రియల్ ఎస్టేట్, రుణాలు ఇచ్చే సంస్థలు పాల్గొని, స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నాయి. కొత్తగా ఏర్పాటవుతున్న వెంచర్లు, అపార్ట్‌మెంట్లు, రెడీమేడ్ ఇండ్లు, ఆధునిక నిర్మాణాలకు అయ్యే వ్యయం, బ్యాంకు రుణాలు, నిర్మాణ రంగానికి సంబంధించిన పూర్తి సమాచారం ఒకే వేదికపై తెలుసుకోవచ్చు. సందర్శకులందరికీ ప్రవేశం ఉచితం.

సకల వసతులతో నిర్మాణాలు

కరీంనగర్‌లోనే సకల వసతులతో అపార్ట్‌మెంట్లను నిర్మించి అందుబాటులో తీసుకువచ్చాం. కొనుగోలుదారుల అభిరుచులకు అనుగుణంగా ఆధునిక సౌకర్యాలు కల్పిస్తున్నాం. వీటితో పాటు పార్కింగ్‌కు ఎక్కడ ఇబ్బంది లేకుండా సౌకర్యవంతంగా నిర్మాణాలు చేస్తున్నాం. కొనుగోలుదారుల ఆసక్తి మేరకు వావిలాలపల్లిలో నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్‌లో ఆధునిక వసతులు కల్పిస్తున్నాం. మేం చేపట్టిన నిర్మాణాలకు ప్రభుత్వం నిబంధనల మేరకు పూర్తిస్థాయిలో అనుమతులు తీసుకొని కొనుగోలుదారులకు అందిస్తున్నాం.

–ఉప్పులూరి కృష్ణమూర్తి, ఎడ్‌వెన్నా సెంచరీ ఈపీసీ ప్రైవేట్ లిమిటెడ్

అత్యాధునిక సౌకర్యాలను అందిస్తున్నాం

హైదరాబాద్‌లాంటి మెట్రోపాలిటన్ నగరాల్లో అందించే అత్యాధునిక సౌకర్యాలతో కరీంనగర్‌లో విల్లాలను నిర్మిస్తున్నాం. నగరానికి సమీపంలోని మల్కాపూర్, నగునూర్ ప్రాంతాల్లో విల్లాలు, అలకపురిలో అపార్ట్‌మెంట్లను నిర్మిస్తున్నాం. మారుతున్న పరిస్థితులు, కొనుగోలుదారుల ఆసక్తికి అనుగుణంగా సకల సదుపాయాలను కల్పిస్తున్నాం. అలకాపురిలోని అపార్ట్‌మెంట్ల నిర్మాణాన్ని ఈ ఏప్రిల్‌లోగా పూర్తి చేసి కొనుగోలుదారులకు అందిస్తాం. మేం చేపడుతున్న అన్ని ప్రాజెక్టులకు ప్రభుత్వం నుంచి అన్ని రకాలుగా అనుమతులు తీసుకొని నిర్మాణాలు చేపడుతున్నాం. ధరలు అందరికీ అందుబాటులో ఉండేలా ఈ ప్రాజెక్టులను రూపొందించాం.

– దిలీప్‌కుమార్ మోట్వానీ, రాయ్‌చందని సింధ్ డెవలపర్స్ మేనేజింగ్ డైరెక్టర్

కాంగ్రెస్‌లో రచ్చరచ్చ

- అధిష్ఠానానికి ఒకరిపై ఒకరు ఫిర్యాదు
- నగర అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి
- రూ.కోటి అడిగారంటూ పురమల్ల శ్రీనివాస్ ఫిర్యాదు
- రోహిత్‌రావు ప్రచారానికి సహకరించలేదని వెల్లడి
- తిప్పికొడుతూ పురమల్లపై నాయకుల ఫిర్యాదు
- సీరియస్‌గా పరిగణించిన అధిష్ఠానం
- తాజాగా శ్రీనివాస్‌కు షోకాజ్ నోటీసు
- మూడు రోజుల్లో సమాధానం చెప్పాలని ఆదేశం

కరీంనగర్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కరీంనగర్ కాంగ్రెస్‌లో రచ్చ రచ్చవుతున్నది. ఒకరిపై మరొకరి ఫిర్యాదులతో దుమారం రేగుతున్నది. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో తన ఓటమికి కారణం పార్టీ నగర అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి రోహిత్‌రావే కారణమంటూ నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్ అధిష్ఠానానికి ఈ నెల ఒకటిన లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. నరేందర్‌రెడ్డిపైనా సంచలన ఆరోపణలు చేశారు. ఈ విషయంపై షోకాజ్ నోటీసులు అందుకున్న ఆ ఇద్దరు నాయకులు, అసలు ఓటమికి పురమల్ల శ్రీనివాసే కారణమంటూ పలు ఆధారాలను అధిష్ఠానం ముందు ఉంచినట్టు తెలుస్తున్నది. దీనిపై సీరియస్‌గా స్పందించిన క్రమశిక్షణా సంఘం చైర్మన్ జీ చిన్నారెడ్డి పురమల్లకు తాజాగా షోకాజ్ నోటీసు జారీచేయడంతోపాటు మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని హెచ్చరించడం ప్రస్తుతం పార్టీలో కలకలం రేపుతున్నది.

రూ. కోటి అడిగారని ఫిర్యాదు

గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి మేనేని రోహిత్‌రావుతోపాటు నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్, తదితరులు కరీంనగర్ అసెంబ్లీ నుంచి టికెట్ ఆశించారు. అందులో పురమల్లకు టికెట్ రాగా.. ఆయన ఎన్నికల్లో మూడో స్థానంలో నిలిచారు. ఎన్నికలు అయ్యాయి కదా అని అనుకున్న సమయంలో.. పురమల్ల శ్రీనివాస్ ఈనెల ఒకటిన టీపీసీసీ క్రమశిక్షణ సంఘం (డీఏసీ)కు లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. అందులో సంచలన ఆరోపణలు చేశారు. ప్రధానంగా తాను ఓడిపోవడానికి నరేందర్‌రెడ్డి, రోహిత్‌రావే కారణమని విమర్శించారు. తనకు అనుకూలంగా ప్రచారం చేయాలంటే.. నరేందర్‌రెడ్డి రూ.కోటి ఇవ్వాలని డిమాండ్ చేశాడని, ఆ మేరకు ఒక ప్రజాప్రతినిధి ముందు ₹20 లక్షలు ఇచ్చానని ఆ ఫిర్యాదులో ఆరోపించారు. మిగిలిన డబ్బులను తర్వాత ఇస్తానని హామీ ఇచ్చానని, అయినా ఆయనకు టికెట్ రాలేదన్న కోపంతో తనకు సహకరించకుండా కార్యకర్తలు, ఓటర్ల వద్ద తనపై దుష్ప్రచారం చేశాడని పేర్కొన్నారు. రోహిత్‌రావు కూడా తనకు వ్యతిరేకంగా పనిచేశారని చెప్పారు. ఇరువురు తన గెలుపు కోసం ప్రయత్నం చేయకపోగా.. ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా అదే తీరున ప్రవర్తిస్తున్నారని, పార్టీ వేదికలు, కార్యక్రమాలకు సంబంధించి ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీ బ్యానర్లలో ప్రొటోకాల్ ప్రకారం తన ఫొటో పెట్టడం లేదని, అక్కడితో ఆగకుండా తనపై అభియోగాలు మోపుతూ వ్యక్తిగత ప్రతిష్టకు నష్టం కలిగేలా ప్రవర్తిస్తున్నారని ఫిర్యాదు చేశారు. తనపై ప్రజలు, పార్టీ శ్రేణులు చూపుతున్న అభిమానాన్ని తట్టుకోలేక ఆ ఇద్దరు గ్రూపు రాజకీయాలు చేస్తున్నారని, అలాగే మరోసారి తనకు టికెట్‌రాదని చెబుతున్నారని, వారికే త్వరలో పదవులు వస్తాయని, పార్టీలో చక్రం తిప్పుతామంటూ కార్యకర్తలను అయోమయానికి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయాలను పరిగణలోకి తీసుకొని పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న సదరు నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్ తన ఫిర్యాదులో స్పష్టం చేశారు. దీంతో స్పందించిన కాంగ్రెస్ క్రమశిక్షణ సంఘం చైర్మన్ చిన్నారెడ్డి.. నాలుగైదు రోజుల క్రితమే నరేందర్‌రెడ్డి, రోహిత్‌రావుకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. ఆ మేరకు వారిద్దరు ఈ నెల 5న వివరణ ఇచ్చారు.

పురమల్లకు షోకాజ్ నోటీసు

నరేందర్‌రెడ్డి, రోహిత్‌రావు అధిష్ఠానానికి వివరణ ఇవ్వడంతోపాటు కరీంనగర్‌లో కాంగ్రెస్ ఓటమికి గల కారణాలను లిఖిత పూర్వకంగా అందించారు. పురమల్ల శ్రీనివాస్ వైఖరి వల్లే పార్టీ ఓటమి పాలైందని, అందులో తమ భాగస్వామ్యం ఏమీ లేదని చెప్పడంతోపాటు ఆయన బీఆర్ఎస్, బీజేపీకి పరోక్షంగా సహకరించారని ఫిర్యాదు చేశారు. అధిష్ఠానం ఇచ్చిన ఏ సమాచారం తమకు అందించకపోగా, ఆదేశాలను పెడచెవిన పెట్టారని, నామినేషన్ నుంచి ఎన్నికల వరకు ప్రతి సమావేశం నిర్వహించడంలో ఆయన ఫెయిల్ అయ్యారని అందులో ఆరోపించారు. శ్రేణులను ఏమాత్రం పట్టించుకోలేదని, ముఖ్యంగా ప్రత్యర్థి పార్టీలతో పురమల్ల కుమ్మక్కు అయ్యారని, ఆయన అసమర్థత, నిర్లక్ష్య ధోరణి వల్లే పార్టీ మూడో స్థానంలో నిలిచిందని ఫిర్యాదులో విమర్శించారు. ప్రధానంగా పార్టీ ఇచ్చిన నిధులను ఖర్చు పెట్టకుండా ఆయన వద్దే ఉంచుకున్నారని, ఇలా అయితే ఎలా గెలుస్తారంటూ అందులో ప్రశ్నించారని సమాచారం. అలాగే స్వగ్రామం బొమ్మకల్‌లో ఆయన సర్పంచ్ పదవిలో ఉన్నారని, ఆయన భార్య జడ్పీటీసీగా ఉన్నారని, అయినా ఆ గ్రామంలో మూడో స్థానంలో నిలువడం శ్రీనివాస్‌పై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతకు నిదర్శనమని ఆధారాలతో సహా తెలిపినట్టు తెలుస్తున్నది. వీటితోపాటు పురమల్లపై ఉన్న కేసులు, ప్రజల్లో అతనిపై వచ్చిన వ్యతిరేకత, భవిష్యత్‌లో తీసుకోవాల్సిన చర్యల వంటి అనేక అంశాలపై ఫిర్యాదు చేసిన విషయాలను అధిష్ఠానం సీరియస్‌గా తీసుకున్నది. తాజాగా పురమల్లకు షోకాజ్ నోటీస్ ఇచ్చింది. మూడు రోజుల్లోగా పూర్తిస్థాయి వివరణ ఇవ్వాలని ఆదేశించింది.

ఫిర్యాదులతో దుమారం

ఇప్పటికే కరీంనగర్ అసెంబ్లీ ఎన్నికల్లో మూడో స్థానంలో ఉన్న కాంగ్రెస్‌లో ఇలాంటి వివాదాలు నెలకొనడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ప్రధానంగా పురమల్ల శ్రీనివాస్ నగర అధ్యక్షుడు నరేందర్‌రెడ్డిపై చేసిన ఆరోపణలు.. ఇదే సమయంలో శ్రీనివాస్‌పై చేసిన లిఖితపూర్వక ఫిర్యాదులు పార్టీలో సంచలనంగా మారాయి. అయితే, ఈ విషయంలో తాడో పేడో తేల్చుకునేందుకు నరేందర్‌రెడ్డి, రోహిత్‌రావు ప్రయత్నాలు చేస్తుండగా.. అదే స్థాయిలో పురమల్ల ఉన్నట్టుగా తెలుస్తున్నది. పార్లమెంట్ ఎన్నికల ముందు.. ఈ వివాదం చెలరేగడం పార్టీపై ప్రభావం చూపుతుందని చర్చ జరుగుతుండగా, అధిష్ఠానం షోకాజ్ నోటీసులకే పరిమితం అవుతుందా..? లేక సీరియస్‌గానే చర్యలు తీసుకుంటుందా..? అన్న ప్రశ్నలు శ్రేణుల్లో కనిపిస్తున్నాయి.

ఓటరు తుది జాబితాలో తప్పులుండొద్దు

- మరణించిన వారి పేర్లను తొలగించాలి
- ఓటు నమోదు, మార్పుచేర్పులకు అవకాశం
- ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ శ్రీదేవసేన

మాట్లాడుతున్న ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ శ్రీదేవసేన

కలెక్టరేట్, ఫిబ్రవరి 8: పార్లమెంట్ ఎన్నికల కోసం రూపొందిస్తున్న ఓటరు తుది జాబితాలో తప్పులు లేకుండా చూడాలని అధికారులను ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ శ్రీదేవసేన ఆదేశించారు. సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్లి మరణించిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించాలని సూచించారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ ఆఫ్ 2024పై ఉమ్మడి జిల్లాలోని ఈఆర్‌వోలు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి గురువారం కరీంనగర్ కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాల మేరకు పనులు చేపట్టాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో బీఎల్‌వోల పనితీరును పరిశీలించాలని, ఒకే ఇంటి నంబరు పరిధిలో ఉండే ఓటర్లంతా ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బీఎల్‌వోలు, బీఎల్ఏలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఒకేచోట ఎక్కువ పోలింగ్ కేంద్రాలున్నట్లైతే, వాటికి ఎంట్రీ, ఎగ్జిట్‌లు వేర్వేరుగా ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. పార్టీల ప్రతినిధులతో సమావేశమై జాబితాలో తొలగించిన వివరాలను అందించాలన్నారు. ఓటు నమోదు, మార్పు చేర్పులకు అవకాశమున్నదన్నారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, చనిపోయిన ఓటర్ల వివరాలు మున్సిపల్, పంచాయతీ రికార్డుల ఆధారంగా జిల్లావ్యాప్తంగా తొలగిస్తామని ఫారమ్ 7 ద్వారా ఎవరైనా బదిలీ అయినా, చనిపోయిన ఓటర్ల వివరాలు సమర్పించవచ్చని స్పష్టం చేశారు. రెండుచోట్ల నమోదైన వారి వివరాలు పరిశీలించి, తొలగిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, అరుణశ్రీ, డీఆర్వో పవన్‌కుమార్, డీపీవో వీరబుచ్చయ్య పాల్గొన్నారు.

ఒక కుటుంబ ఓట్లు ఒకే బూత్‌లో ఉండాలి

ఒక కుటుంబంలోని ఓట్లు ఒకే పోలింగ్ బూత్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలంటూ, ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ శ్రీదేవసేనకు బీఆర్ఎస్ నాయకుడు సత్తినేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు వినతిపత్రం అందజేశారు. గురువారం కలెక్టరేట్ ఆడిటోరియంలో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు చేపడుతున్న చర్యల్లో భాగంగా నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్పెషల్ సమ్మరి రివిజన్ 2024 సమీక్ష సమావేశంలో పాల్గొనగా, జిల్లాలో గత శాసనసభ ఎన్నికల్లో ఓటర్లు ఎదుర్కొన్న ఇబ్బందులపై ఆమెకు లిఖితపూర్వకంగా విన్నవించారు. ఈ సందర్భంగా వినతిపత్రాన్ని పరిశీలించిన ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ మాట్లాడుతూ, గత సమస్యలు పునరావృతం కాకుండానే ముందస్తుగా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

WANTED
jobs
★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-319433-All

CHANGE OF NAME
★ I, GOLI DAVAIAH, S/o. Narayana, R/o. 9-5-72/1, Bhagavantharao Nagar, Vemulawada, Rajanna Sircilla, TS. Changed My Name as GOLI DEVAIAH, S/o. Narayana.
NT-311088

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

చొప్పదండి, ఫిబ్రవరి 8: పట్టణంలోని ఎరువుల దుకాణాలను గురువారం జిల్లా వ్యవసాయాధికారి ప్రియదర్శిని తనిఖీ చేశారు. స్టాక్ నిల్వలు, రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట ఏవో వంశీకృష్ణ ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, ఫిబ్రవరి 8: నగరంలో 11కేవీ భగత్‌నగర్ లైన్ పనులు చేపడుతున్నందున శుక్రవారం భగత్ నగర్ ఏరియా, శివాలయం ప్రాంతం, పెద్దమ్మ గుడి ఏరియా, వెంకటేశ్వర కాలనీ, విఘ్నేశ్వర కాలనీ, ఫకీరువాడ, ఎర్రగుట్ట కాలనీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

వినియోగదారులకు అవగాహన

మానకొండూర్ రూరల్, ఫిబ్రవరి 8: చెంజర్ల విద్యుత్ ఉప కేంద్రం ఆవరణలో గురువారం విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు ఏర్పాటు చేసినట్లు ఎన్పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్‌పర్సన్ తిర్మల్ రావు తెలిపారు. కార్యక్రమంలో ఫోరం సభ్యుడు నరేందర్, వినియోగదారులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి

చొప్పదండి, ఫిబ్రవరి 8: చొప్పదండి సర్కిల్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని సీఐ ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. మెదక్ జిల్లాలో సీసీఎస్ విభాగంలో సీఐగా పనిచేసిన ప్రకాష్ గౌడ్ చొప్పదండి సర్కిల్ సీఐగా బదిలీపై వచ్చారు. గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీఐ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కాగా ఇక్కడ సీఐగా చేసిన గోపతి రవీందర్ కరీంనగర్ టాస్క్‌ఫోర్స్‌కు బదిలీ అయ్యారు.

విద్యార్థుల ప్రతిభ

గంగాధర, ఫిబ్రవరి 8: కరీంనగర్‌లోని కళ్యాణి గార్డెన్స్‌లో నిర్వహించిన అబాకస్, వేదిక మ్యాథ్స్ పోటీ పరీక్షల్లో గర్శకుర్తి సరస్వతి పాఠశాల విద్యార్థులు మిట్టపెల్లి రితేష్, శ్రీపతి చైతన్యశ్రీ, పాలె రేష్మ, సాగారపు కార్తీక్ ప్రతిభ చూపి బహుమతులు సాధించినట్లు కరస్పాండెంట్ మిట్టపెల్లి రాజశేఖర్ తెలిపారు. విద్యార్థులను కరస్పాండెంట్‌తో పాటు ప్రిన్సిపాల్ మాధవి అభినందించారు.

'ట్రాఫిక్' పై అవగాహన

రాంనగర్, ఫిబ్రవరి 8: కరీంనగర్‌లోని అల్ఫోర్స్ పాఠశాలలో గురువారం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ట్రాఫిక్ నియమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ట్రాఫిక్ ఏసీపీ సర్వర్ మాట్లాడుతూ, కమిషనరేట్ వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతామని పేర్కొన్నారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు రమేశ్, కరీముల్లా ఖాన్, అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి ఉన్నారు.

కొత్త ఉత్పత్తులపై దృష్టి సారించాలి

- చేనేత, జౌళి శాఖ సంచాలకురాలు అలుగు వర్షిణి
- చేనేత సహకార సంఘాల పరిశీలన

మాట్లాడుతున్న చేనేత, జౌళి శాఖ సంచాలకురాలు అలుగు వర్షిణి

వీణవంక, ఫిబ్రవరి 8 : మారుతున్న మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా చేనేత ఉత్పత్తులు జరగాలని చేనేత, జౌళిశాఖ సంచాలకురాలు అలుగు వర్షిణి సూచించారు. వీణవంక మండలం కోర్కళ్, కిష్టంపేట గ్రామాల్లో చేనేత సహకార సంఘాలను గురువారం ఆమె కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చేనేత వస్త్రాల స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. చేనేత సహకార సంఘాల ఉత్పత్తులను టెస్కో ద్వారా కొనుగోలు చేస్తామని, మారుతున్న మార్కెటింగ్ పరిస్థితులకు అనుగుణంగా మగ్గాలను ఆధునీకరించి నూతన ఉత్పత్తులను తయారు చేయడానికి తగు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా కార్మికులు వివిధ శాఖల ద్వారా ఆర్డర్లను ఇప్పించాలని కోరారు. అంతకు ముందు కలెక్టర్ పమేలా సత్పతి చల్లూరు పీహెచ్‌సీని సందర్శించారు. ఆయా వార్డులను పరిశీలించి, అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

చేనేత కార్మికులకు ఆధునిక శిక్షణ ఇస్తాం

కలెక్టరేట్, ఫిబ్రవరి 8: చేనేత కార్మికుల జీవన ప్రమాణాలు పెంచేందుకు ఆధునిక శిక్షణ ఇచ్చి, వస్త్ర ఉత్పత్తిలో మెలకువలు నేర్పి, ఉపాధి కల్పిస్తామని, చేనేత జౌళి శాఖ సంచాలకురాలు డాక్టర్ అలుగు వర్షిణి తెలిపారు. నగరంలోని రహదారులు, భవనాల శాఖ అతిథి గృహంలో చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో చేనేత సహకార సంఘాల ప్రతినిధులతో టెస్కో వస్త్ర పీపీ ఆర్డర్లపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. సూటింగ్స్, టవల్స్, కార్పెట్ రకాల్లో కొత్తరకం వస్త్ర రూపకల్పన కోసం చేనేత కార్మికులు ముందుకు రావాలన్నారు. వారి మగ్గాల వివరాలు ఇస్తే, వారికి ఆయా వస్త్ర ఉత్పత్తికి తగిన శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసి, ఉపాధి కల్పిస్తామని స్పష్టం చేశారు. కొత్త వెరైటీ, డిజైన్ల రూపకల్పనకు శిక్షణ ఇచ్చి సహకారం అందిస్తామని వెల్లడించారు. చిన్న సంఘాలకు, వస్త్ర ఉత్పత్తికి నూలు సరఫరా చేస్తామన్నారు. ప్రభుత్వ శాఖల నుంచి టెస్కో ద్వారా ఆర్డర్లు పొంది కార్మికులకు ఉపాధి కల్పించి వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేలా కృషి చేస్తామన్నారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ.. సహకార సంఘాలకు క్యాష్ క్రెడిట్ ఇవ్వడానికి జిల్లా సహకార బ్యాంకుల్లో అడ్డంకులు తొలగించి రుణ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆయా కార్యక్రమాల్లో టెస్కో జనరల్ మేనేజర్ వెంకటేశ్వర్‌రావు, ఉపసంచాలకులు వీ అశోక్‌రావు, టెస్కో టెక్నికల్ ఆఫీసర్ హిమజ్‌కుమార్, డీఎంవో వెంకటేశ్వర్లు, సహాయ సంచాలకుడు చరణ్, కోర్కళ్, నర్సింగాపూర్ సహకార సంఘాల చైర్మన్లు అడిగొప్పుల సత్యనారాయణ, జడల రమేశ్, తహసీల్దార్ తిరుమల్‌రావు పాల్గొన్నారు.

ఎంపీపీపై ఫిర్యాదు

మానకొండూర్/రూరల్, ఫిబ్రవరి 8: మానకొండూర్ ఎంపీపీ సులోచనపై బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కో-ఆర్డినేటర్ జక్కని సంజయ్‌కుమార్ గురువారం ఢిల్లీలో జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్సరాజ్ గంగారాంఅహిర్‌కు ఫిర్యాదు చేశారు. తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించి బీసీ రిజర్వేషన్ స్థానంలో ఓసీ కులానికి చెందిన ముద్దసాని సులోచన మానకొండూర్ ఎంపీపీగా ఎన్నికైందని, కులం పేరు అబద్ధం చెప్పి ప్రభుత్వాన్ని, అధికారులను తప్పుదోవ పట్టించిన సులోచనాశ్రీనివాస్‌రెడ్డిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. స్పందించిన చైర్మన్ విచారణకు ఆదేశించినట్లు సంజయ్‌కుమార్ తెలిపారు.

కరీంనగర్‌లో మహిళా ఓటర్లే ఎక్కువ

కలెక్టరేట్, ఫిబ్రవరి 8: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం గురువారం తుది ఓటరు జాబితా విడుదల చేసింది. దీని ప్రకారం జిల్లాలో 10,71,792 మంది ఓటర్లు ఉన్నట్లు ప్రకటించింది. గత నెల 5న ప్రకటించిన ముసాయిదా జాబితా అనంతరం తుది జాబితాలో 7,663 మంది ఓటర్లు కొత్తగా చేరారు. డ్రాఫ్ట్ పబ్లికేషన్ అనంతరం మూడు నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్య పెరుగగా, హుజూరాబాద్‌లో మాత్రం 947 మంది ఓటర్లు తగ్గారు. కాగా, ఈసారి జిల్లాలోని నాలుగు అసెంబ్లీ సెగ్మెంట్లలో మహిళా ఓటర్లే అత్యధికంగా ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

హుజూరాబాద్‌టౌన్, ఫిబ్రవరి 8: వరల్డ్ క్యాన్సర్ డేను పురస్కరించుకొని కూరపాటి హాస్పిటల్ వారి కూరపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజలకు ఉచితంగా షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ కూరపాటి రాధిక రమేశ్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గోవర్ధన్, శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు శ్రీనివాస్, రమేశ్ పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు అండగా ఉంటాం

- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి
- హైదరాబాద్‌లో ఆటో ఎక్కి అసెంబ్లీకి పయనం



ఆటోలో అసెంబ్లీకి వెళ్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్‌టౌన్, ఫిబ్రవరి 8: 'కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం సరైన. అయితే ఆటో డ్రైవర్లకు గురించి ఆలోచన చేయకపోవడం దారుణం. ఫలితంగా కొన్ని లక్షల మంది ఆటో డ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. వారికి బీఆర్ఎస్ ప్రభుత్వం తప్పక అండగా ఉంటుందని' హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి భరోసా కల్పించారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా గురువారం ఆటో దారులకు మద్దతుగా కౌశిక్‌రెడ్డి హైదరాబాద్‌లో ఆటోలో అసెంబ్లీకి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన అసెంబ్లీ ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడారు. కరీంనగర్‌లో బుర్ర కరుణాకర్ అనే ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకోవడం హృదయాన్ని కలిచివేసిందన్నారు. తాను ఆటోలో వస్తున్నప్పుడు ఉచిత ప్రయాణం వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్వయంగా డ్రైవర్లే తనతో చెప్పారని తెలిపారు. కుటుంబ పోషణ కూడా చాలా ఇబ్బందిగా ఉందని తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఆటో దారులకు మద్దతుగా అసెంబ్లీకి వచ్చిన తర్వాత కూడా ఆటోని అసెంబ్లీ ఆవరణలోకి అనుమతించలేదని, ఆటో వారిపై ప్రభుత్వానికి ఇంత చిన్నచూపు ఎందుకని ప్రశ్నించారు. గతంలో ఎందరో ఎమ్మెల్యేలు, మంత్రులు సైతం ఆటోల్లో అసెంబ్లీ వచ్చారని గుర్తు చేశారు. ఆటో డ్రైవర్లు కూడా ఓటు వేస్తేనే ఈ ప్రభుత్వం ఏర్పడిందనే విషయాన్ని మర్చిపోవద్దని పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 21 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సమస్యపై దృష్టి పెట్టాలని కౌశిక్‌రెడ్డి సూచించారు. ఆటో డ్రైవర్లు ఎవరు అధైర్య పడి ఆత్మహత్యకు పాల్పడవద్దని కౌశిక్‌రెడ్డి పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ఆటో డ్రైవర్ల సమస్యలపై కూడా తప్పక ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సందర్శన

హుజూరాబాద్‌టౌన్, ఫిబ్రవరి 8: హుజూరాబాద్ శివారులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని గురువారం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ సుభాషిణి సందర్శించారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. భూములు రిజిస్ట్రేషన్ చేస్తున్న తీరును సబ్ రిజిస్ట్రార్ మక్బూద్ అలీని అడిగి తెలుసుకున్నారు. కార్యాలయ సమాచారం తెలిపే సెల్ నంబర్లతో కూడిన బోర్డును ఏర్పాటు చేయాలని సబ్ రిజిస్ట్రార్‌కు సూచించారు. ఆమె వెంట జిల్లా రిజిస్ట్రార్, ఉద్యోగులు ఉన్నారు.

బండి సంజయ్ శ్వేతపత్రం విడుదల చేయాలి

రాంనగర్, ఫిబ్రవరి 8: కరీంనగర్ ఎంపీగా నియోజకవర్గానికి తెచ్చిన నిధులు, చేసిన పనులపై బండి సంజయ్ శ్వేతపత్రం విడుదల చేయాలని, లేదంటే ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం సిటీ కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నరేందర్‌రెడ్డి మాట్లాడారు. భూ కబ్జాలో కాంగ్రెస్ నాయకులున్నా వదిలిపెట్టేది లేదని, అక్రమాలకు పాల్పడిన వారిని శిక్షించే దాకా వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు.

పారమిత విద్యార్థిని ప్రతిభ

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 8: జిల్లా కేంద్రంలోని పారమిత హెరిటేజ్ పాఠశాల పదో తరగతి విద్యార్థిని శుభశ్రీ సాహు తయారు చేసిన శాస్త్రీయ ఆవిష్కరణలు వీవో ఇగ్నైట్ టెక్నాలజీ, ఇన్నోవేషన్ గ్రాండ్ ఫినాలేకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రితేష్ మెహతా పేర్కొన్నారు. విద్యార్థినిని విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ప్రసాదరావు అభినందించారు.

విద్యార్థికి ఘన సన్మానం

కొత్తపల్లి, ఫిబ్రవరి 8: బొమ్మకల్‌లోని గిరిజన గురుకుల డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థి మీస విజయ్‌కుమార్‌ను గురువారం కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు సన్మానించారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే పరేడ్‌కు ఉమ్మడి జిల్లా నుంచి గిరిజన గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థి మీస విజయ్‌కుమార్ హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లావణ్య, ఎన్‌సీసీ కేర్ టేకర్ రమేశ్, పీఐ అబ్దుల్ ముజీబ్ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడ్డ యువకుడు

శంకరపట్నం, ఫిబ్రవరి 8: కరీంపేట్ గ్రామానికి చెందిన మహ్మద్ గౌస్ (30) గురువారం ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడ్డట్లు గ్రామస్తులు తెలిపారు. మధ్యాహ్నం సమయంలో ఇంట్లోంచి బయటకు వచ్చిన గౌస్ ఓ రైతు వ్యవసాయ బావిలో ప్రమాదవశాత్తు జారి పడ్డట్లు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి స్థానిక యువకులతో కలిసి బావిలో గాలింపు చర్యలు చేపట్టారు. అయితే చీకటి పడడంతో గాలింపు చర్యలు నిలిపివేశారు. తిరిగి శుక్రవారం గాలిస్తామని పోలీసులు తెలిపారు.

ఉపాధ్యాయురాలికి మెమో

గంగాధర, ఫిబ్రవరి 8: మంగపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలికి గురువారం మెమో జారీ చేసినట్లు ఎంఈవో అంబటి వేణుకుమార్ తెలిపారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా బుధవారం అధికారులు, జీపీ సిబ్బంది, గ్రామస్తులు పాఠశాలను సందర్శించిన సమయంలో ఉపాధ్యాయులు ఎవరూ లేకపోవడంతో ఎంపీడీవో మల్హోత్ర, గ్రామస్తులు ఎంఈవో దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సదరు ఉపాధ్యాయురాలికి మెమో జారీ చేసినట్లు ఎంఈవో తెలిపారు. పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండగా ఒకరు సెలవులో ఉన్నట్లు పేర్కొన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి

చిగురుమామిడి, ఫిబ్రవరి 8: గ్రామాల్లో ఉపాధి హామీ పనులకు కూలీలు వచ్చేలా ప్రోత్సహించాలని ఎంపీడీవో నర్సయ్య సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, వేసవిలో పనులు కల్పించేందుకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు.